AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
8-7-2026 (Wednesday) MAIN EDITION

## యూట్యూబర్ రావణ్ అరాచకాలు..



**అక్షరటుడే, ఏపీ :** హిందూ దేవతలు, ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేసి పలు కేసుల్లో అరెస్టయిన యూట్యూబర్ రావణ్ (బచ్చలకూరి జోసెఫ్) అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఆయన ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపగా వచ్చిన నివేదిక పోలీసులను సైతం నివ్వెరపరిచింది. పోలీసుల కళ్లు గప్పేందుకు రావణ్ తన ఫోన్‌లోని డేటాను డిలీట్ చేశాడు. అయితే, అత్యాధునిక సాంకేతికతతో ఆ డేటాను రికవర్ చేసిన పోలీసులు దిగ్భ్రాంతికరమైన విషయాలను గుర్తించారు. అమాయక యువతులను టార్గెట్ చేసుకుని, వారితో ఏకాంతంగా ఉన్న సమయాల్లో రహస్యంగా ఫోటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్లు తేలింది.

## పీఎఫ్ విత్‌డ్రా ఇక సులువు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** లక్షలాది మంది ఉద్యోగుల పీఎఫ్ విత్‌డ్రా ఇబ్బందులను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో పీఎఫ్ సేవలు అత్యంత వేగంగా అందుబాటులోకి రానున్నాయి. పాత విధానంలో క్లెయిమ్ సెటిల్‌మెంట్ కోసం వారాల సమయం పట్టేది. కొత్త టెక్నికల్ మార్పుల వల్ల ఇకపై కేవలం 3 పని దినాల్లోనే నగదు ఖాతాదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. అర్హులైన ఖాతాదారులు రూ. 5 లక్షల వరకు పీఎఫ్ మొత్తాన్ని 'ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్' ద్వారా నేరుగా పొందవచ్చు. దీని కోసం మాన్యువల్ అనుమతుల కోసం వేచి చూడాల్సిన పని లేదు.

## ఇరాన్‌తో సీజ్‌ఫైర్ ముగిసింది : ట్రంప్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో కాల్పుల విరమణ ముగిసిందన్నారు. ఇక భవిష్యత్‌లోనూ చర్చలు ఉండవని స్పష్టం చేశారు. టెహ్రాన్ క్షమించరాని తప్పులు చేస్తోందన్నారు. చర్చల పేరుతో వృథా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు



అక్షరటుడే, వరంగల్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మంత్రి కొండా సురేఖకు కౌంటర్ ఇచ్చారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అభివృద్ధిని పట్టించుకోని వారే వివాదాలు సృష్టిస్తున్నారని అన్నారు. జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు.

## పాకిస్థాన్‌లో విమానం మిస్సింగ్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: పాకిస్థాన్‌లో బోయింగ్ 737 కార్గో విమానం మిస్సయ్యింది. షార్జా నుంచి కరాచీకి వస్తున్న విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు అధికారులకు సమాచారం అందింది. అనంతరం అది ఏటీసీతో సంబంధాలు కోల్పోయింది. బలోచిస్థాన్‌లోని ఒర్మారా సమీపంలో అరేబియా సముద్రంపై విమానం అదృశ్యం అయింది.

## లష్కర్ ఏ తోయిబా ఉగ్రవాది హతం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కర్ ఏ తోయిబా ఉగ్రవాది హతం అయ్యాడు. ఐదు రోజుల క్రితం ఆ ప్రాంతంలోని ఒక దట్టమైన పండ్ల తోటలో నిఘా కెమెరాలలో ఇద్దరు ఉగ్రవాదులు కనిపించడంతో, ఈ ఉగ్రవాది భద్రతా దళాల దృష్టికి వచ్చాడు. లష్కర్ కమాండర్ జాకిర్ గనాయ్, అతని సహచరుడు లతీఫ్ భట్ ఉన్నారనే సమాచారం మేరకు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. సైద్‌పోరాలోని ఛానాపోరా ప్రాంతంలో సంచరిస్తుండగా వారిద్దరూ సీసీటీవీ కెమెరాలలో చిక్కారు. వెంటనే ఆపరేషన్ ప్రారంభించి, ఆ ప్రాంతాన్ని దిగ్బంధించారు. హతమైన ఉగ్రవాది గుర్తింపును నిర్ధారించుకోవడానికి భద్రతా దళాలు ప్రయత్నిస్తున్నాయి. ఎన్‌కౌంటర్ అనంతరం కశ్మీర్ పోలీసులు "మీరు పారిపోవచ్చు, కానీ దాక్కోలేరు" అని పోస్ట్ చేశారు.

## నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం లేదు : కెనడా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023లో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యతో భారత అధికారులకు సంబంధం ఉందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవని కెనడా పోలీసులు బుధవారం తెలిపారు. నిజ్జర్‌ను కెనడాలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. దీంతో అప్పటి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఈ ఘటనపై భారత అధికారుల ప్రమేయం ఉందని ఆరోపించారు. అనంతరం రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ట్రూడో తర్వాత 2025లో మార్క్ కార్నే ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఈ క్రమంలో నిజ్జర్ హత్యతో భారత్‌కు సంబంధాలు ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.



**రాష్ట్రంలో రాజకీయాలు గోదావరి జలాల చుట్టూ తిరుగుతున్నాయి. వర్షా లు లేకపోవడం, జలాశయాల్లో నీటిమట్టం పడిపోవడంతో.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా గోదావరి నుంచి నీటిని ఎత్తిపోయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ నాయకులు కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బుధవారం మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి పాలనలో విఫలం అయ్యారని విమర్శించారు. నీరు ఉన్నా ఎత్తిపోయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.** - అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- నీళ్లు ఎలా రావో చూపిస్తా..
- సీఎంకు హరీశ్‌రావు సవాల్
- దేవాదుల నుంచి నీటిని ఎత్తిపోయాలని సూచన

# ఇరిగేషన్ శాఖ అప్పగించు

రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు సవాల్ విసిరారు. ‘‘ఒక్క మూడు నెలలు నాకు ఇరిగేషన్ శాఖ అప్పగించు.. నీళ్లు ఎలా రావో నేను చూపిస్తా’’’ అన్నారు. ఒకవేళ నీళ్లు తేకపోతే శాశ్వతంగా తాను రాజకీయాల నుండి తప్పుకుంటానన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వం నెగెటివ్ మైండ్ సెట్‌తో ఉందని అన్నారు. మేడిగడ్డ విషయంలో కుంటిసాకులు చెప్తున్నారని, మరి దేవాదుల నీటిని ఎందుకు ఎత్తిపోయడం లేదని ప్రశ్నించారు.

### వారిని ఉరి తీసినా తప్పలేదు

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్ విఫలమయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి వస్తుందన్నారు. ‘మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదు’ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే రేవంత్ రెడ్డి నీటిని కిందకి వదులుతున్నారని ఆరోపించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో ఈరోజు 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉందని హరీశ్‌రావు అన్నారు. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయవచ్చని చెప్పారు. దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే ప్రస్తుతం ప్రభుత్వం 900 క్యూసెక్కుల నీటిని మాత్రమే ఎత్తిపోస్తుందని విమర్శించారు.

### అన్ని మోటార్లు ఆన్ చేయాలి

దేవాదుల ఫేజ్-1లో రెండు మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారని, ఫేజ్-2లో రెండు మోటార్లకు ఒకటి, ఫేజ్-3లో 6 మోటార్లు ఉంటే రెండు మాత్రమే ఆన్ చేశారని చెప్పారు. రామప్ప చెరువులో నీరు లేదన్నారు. దేవాదుల నుంచి ఆ చెరువును నింపే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్‌లో 75 శాతం చెరువులు ఎండిపోయాయన్నారు. గోదావరి నీళ్లు పోతుంటే.. వాటిని వినియోగించుకోవాలనే సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే.. నీటిని దిగువకు విడుదల చేస్తున్నారని మండిపడ్డారు.

### ఆ ఒప్పందం బయటపెట్టాలి

తుమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తు పెంచడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్నట్లు అగ్రిమెంట్ ఉంటే బయటపెట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అగ్రిమెంట్ బయట పెడితే తాను రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. అగ్రిమెంట్ లేకుంటే క్షమాపణలు చెప్పాలన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు.

## అమెరికాపై ఇరాన్ ప్రతీకార దాడులు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రపంచ దేశాలు ఆందోళనగా చూస్తుండగానే, అమెరికా, ఇరాన్ మధ్య ఘర్షణ తీవ్ర రూపం దాల్చింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై జరిగిన దాడులే వేదికగా, ఇప్పుడు ఇరు దేశాలు ఒకరిపై ఒకరు క్షిపణి, డ్రోన్ దాడులతో విరుచుకుపడుతున్నాయి. అమెరికా 'సెంట్రల్ కమాండ్' ఆధ్వర్యంలో ఇరాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టింది. ఇరాన్ అంతటా విస్తరించి ఉన్న కమాండ్ సెంటర్లు, రాడార్ కేంద్రాలు, వైమానిక రక్షణ వ్యవస్థలు, నౌకా విధ్వంసక క్షిపణి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని 80కి పైగా ప్రదేశాలపై అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. అమెరికా దాడులను 'దురాక్రమణ'గా పేర్కొన్న ఇరాన్, వెంటనే ప్రతీకారానికి దిగింది. బహ్రెయిన్‌లోని అమెరికా ఐదవ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం, కువైట్‌లోని అలీ అల్‌సలేమ్ వైమానిక స్థావరాలకు అనుసంధానమై ఉన్న 85 కీలక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని తాము క్షిపణి, డ్రోన్ దాడులు చేశామని ఇరాన్ ప్రకటించింది. దీంతో మరోసారి పశ్చిమాసియాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

## వృథాగా పోతున్న కాళేశ్వరం జలాలు : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సాగునీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఒకపక్క నీళ్లు లేక పల్లెల్లో రైతన్నల కన్నీళ్లు పెడుతున్నారని, మరో పక్కక మేడిగడ్డ దగ్గర లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయన్నారు. వానల్లేక.. ఎవుసం జరగక అన్నదాత అల్లాడుతుంటే ప్రభుత్వానికి పాపం అనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం దగ్గర పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలను ఎత్తిపోసి.. రైతులకు సాగు నీరు అందించాలన్నారు.

## పవన్ కల్యాణ్ అభిమాని నిరంజన్ కన్నుమూత



**అక్షరటుడే, వరంగల్ :** హనుమకొండకు చెందిన పవన్ కల్యాణ్ అభిమాని పొనుగంటి నిరంజన్ (17) కన్నుమూశారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్‌ను పవన్ కల్యాణ్ గత నెలలో పరామర్శించిన విషయం తెలిసిందే. నిరంజన్‌కు జన్యు సంబంధ వ్యాధి రావడంతో ఎదుగుదల ఆగిపోయింది. ఆయన మంచానికే పరిమితం అయ్యాడు. అతడు పవన్ కల్యాణ్ వీరాభిమాని. ఈ విషయం తెలుసుకున్న పవన్ జూన్ 17న నిరంజన్‌ను పరామర్శించారు. కుక్కపిల్లను బహుమతిగా ఇచ్చారు. 'ఓజీ 2' సినిమాను కలిసి చూద్దామని హామీ ఇచ్చారు. అంతలోనే నిరంజన్ మరణించడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

## సూర్యాపేట జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు



**అక్షరటుడే, సూర్యాపేట :** కాంగ్రెస్‌లో వర్గపోరు ముదురుతోంది. సూర్యాపేట జిల్లాలో ఎంపీ వర్గంపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయడం కలకలం సృష్టించింది. తుంగతుర్తి కాంగ్రెస్ మండల అధ్యక్ష ఎన్నికల్లో ఎమ్మెల్యే మందుల సామేలు ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ.. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్గీయులు బుధవారం ఉదయం గాంధీ భవన్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన పలువురు వారిని అర్వపల్లి వద్ద అడ్డుకున్నారు. వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడికి చేశారు. దాడిలో కాంగ్రెస్ నాయకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పలువురు పోలీసులు కూడా గాయపడ్డారు. దీంతో గొడవ ఆపడానికి పోలీసులు లాఠీఛార్జీ చేశారు. ఈ ఘటనలో పలు వాహనాలను ధ్వంసం చేశారు.

## లారీ డ్రైవర్లపైకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు




**అక్షరటుడే, ఏపీ :** ఏపీలోని ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లారీ డ్రైవర్లపైకి బస్సు దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందారు. లారీ డ్రైవర్లు తమ వాహనాలను ఆపి గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు, మితిమీరిన వేగంతో వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదం కారణంగా హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అవ్వగా.. పోలీసులు, హైవే సిబ్బంది రంగంలోకి దిగి వాహనాలను క్లియర్ చేశారు.

## సమోసాల కోసం రైలు ఆపిన లోకో పైలెట్.. అసలు నిజం ఇదే..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** సమోసాల కోసం లోకో పైలెట్ ఏకంగా ప్యాసింజర్ రైలును ఆపాడని ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై తాజాగా రైల్వే శాఖ అధికారులు క్లారిటీ ఇచ్చారు. ఆ వీడియోలో లోకో పైలట్ రైలు నుంచి వచ్చి సమీపంలోని దుకాణంలో సమోసాలు కొనుగోలు చేసినట్లు ఉంది. వీడియోలో కనిపించిన రైలు ప్యాసింజర్ సర్వీస్ కాదు, అది ఒక గూడ్స్ రైలు అని రైల్వే శాఖ తెలిపింది. 'రౌ' యార్డ్‌లో జరుగుతున్న ఇంజనీరింగ్ పనుల కారణంగా ఆ రైలును 'రౌ హోమ్ సిగ్నల్' వద్ద నిలిపి ఉంచారని స్పష్టం చేసింది. సమోసాలు, కచోరీలు కొంటూ కనిపించిన వ్యక్తి అసిస్టెంట్ లోకో పైలట్ అని, ట్రాక్ నిర్వహణ పనులతో రైలు అప్పటికే ఆగి ఉన్న సమయంలో, నిర్ణీత విరామ సమయంలోనే ఆయన బయటకు వచ్చారని రైల్వే శాఖ తెలిపింది.